# మంగమ్మగారు మదిరాపానం

"అమ్మా ఈ వీకెండ్ మనం 'నాపా' వైనరీస్‌కి వెళ్దాం" అంటూ ముందే చెప్పేసింది మంగమ్మగారి అమ్మాయి.

ఇంకా గురువారం వస్తుండగానే " రేపొక్కరోజు ఆఫీసుకు వెళ్ళొస్తే వీకెండ్ వచ్చేస్తుంది" అంటూ వారాంతపు సెలవులలో ఎక్కడికి వెళ్ళాలని ముందుగానే ప్రణాళిక వేస్తుంటారు కూతురు, అల్లుడు.



"ఏం వుందక్కడ? సాయంత్రానికి ఇంటికి చేరగలమా?" అనడిగారు మంగమ్మగారు.

"రాత్రి 'జెమిని' టి.వి.లో సీరియల్ చూడలేకపోతామేమో నన్న బెంగ మీ అమ్మకు" చిన్నగా నవ్వి అన్నారు మంగపతిగారు.

అమ్మా నాన్నా వచ్చాక తెలుగు ఛానెల్స్‌కి డబ్బు కట్టి కనెక్షన్ తీసుకుంది వాళ్ళమ్మాయి. భార్య భర్త ఉద్యోగాలకు వెళ్ళిపోతే పెద్దవాళ్ళిద్దరికీ టి.వి.తోనే కాలక్షేపం.

అమ్మాయి పనిచేసేది శాన్‌ఫ్రాన్సిస్‌కోలో.

ఇంటి నుండి ఉదయం ఏడింటికే బయల్దేరి, కార్లో దగ్గర్లో స్టేషను దాకా వెళ్ళి అక్కడ కారు పార్క్ చేసి రైల్లో శాన్‌ఫ్రాన్సిస్‌కోకు వెళ్తుంది. మళ్ళీ రావడం రాత్రి ఆరింటికే. అల్లుడు పనిచేసేది ' శాన్ హోసె' అనే ఊళ్లో. అతను కార్లోనే వెడతాడు ఆ ఇరవై అయిదు మైళ్ళ దూరం.

శనివారం పొద్దున్నే బయల్దేరాలని అనుకున్నారు గనుక శుక్రవారం రాత్రికే పులిహోర గుజ్జు తయారుచేసి పెట్టింది మంగమ్మగారు. పొద్దున్న ఫలహారానికని చపాతీలు చేసింది.

ఇంకా ఎవరూ నిద్ర లేవకముందే తను లేచి అన్నం వండి పులిహోర, పెరుగన్నం సిద్ధం చేసి, తను తయారయి కూర్చుంది.

"అత్తయ్యగారికి 'నాపా' వ్యాలి చూడాలని చాలా ఉత్సాహంగా వున్నట్టుంది" అంటూ అల్లుడు ఆటపట్టించాడు.

"ఇంతకీ అక్కడకు వెళ్లి ఏం చూడబోతున్నామో చెప్పరేం?" చిన్న పిల్లలా అడిగిందావిడ.

"అమ్మా 'నాపా' వ్యాలీలో బెరింగర్ వైనరీస్'లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ద్రాక్ష తోటలూ అవీ చాలా అందంగా వుంటుంది" అంటూ ఊరించింది కూతురు.

"త్రాగబోతూ రుచి అడగడం దేనికి అత్తయ్యగారూ? అక్కడకు వెళ్ళిన వాళ్ళు" ఊరికే తోటలు చూసి రావడం కాదు ద్రాక్ష రసం రుచి చూడాలి... మాకైతే అలవాటనుకోండి. మరి మీరు తట్టుకోగలరో లేదో" ఆర్థోక్తిలో ఆపాడు అల్లుడు.

మంగమ్మగారి గుండె గుభేలుమంది. 'అల్లుడు చక్కని అదుపాజ్ఞలలో పెరిగినవాడు. ఈ అలవాటు ఎక్కడి నుండి వచ్చింది?" ఆరాగా కూతురివైపు చూసింది.

"ఆయన నిన్ను భయపెట్టాలని చూస్తున్నార్లే అమ్మా" అంటూ నవ్వేసింది కూతురు.

వాళ్ళు ప్రయాణమయ్యే సరికి ఎనిమిది గంటలు దాటింది టైము. ఇంచుమించు గంటన్నర తరువాత 'నాపా' వ్యాలీ చేరారు. రోడ్డుకటూ ఇటూ మైళ్ళ పొడవున ద్రాక్ష తోటలున్నాయి.

పక్కనే వున్న కొండమీదికి వెళ్ళడానికి 'గండోలా' రైడ్స్ ఏర్పాటు చేశారు. 'క్యారేజి హవుస్', 'ఓల్డ్ స్టోన్ సెల్లార్స్', 'కేవ్స్' చూడ్డానికి టికెట్లు కొనుక్కుని లోపలికి వెళ్ళారు. సందర్శకులను ఒక గైడ్ దగ్గర వుండి

పాతకాలంలో ఆ గుహలలో వైన్ ఎలా తయారు చేసేవారో, ఎలా స్టోర్ చేసే వారో వివరించి చూపించి అంతా తిప్పాడు.

జాకబ్ బెరింగర్ అనే అతను 1856లో జర్మనీ నుండి కాలిఫోర్నియాకు వచ్చి నాపా వ్యాలీలో చక్కని విన్‌యార్డ్స్ పెంచే అవకాశం వుందని గ్రహించి అక్కడే స్థిరపడి ప్రస్తుతం 'హాడ్సన్ హావుస్' గా పిలవబడే చోట నివాసం ఏర్పరచుకున్నాడట. ఈ రోజున బెరింగర్ విన్‌యార్డ్స్ ప్రపంచ ప్రసిద్ధి పొందిన 'వైన్' తయారీకి పేరు పొందాయిట.

అక్కడక్కడ ఫోటోలు తీసుకున్నాక 'వైన్ టేస్టింగ్' సెంటర్‌కి తీసుకువచ్చాడు గైడ్.

అక్కడ కౌంటర్ల వెనకాల వున్న ఎఱ్ఱజుత్తు తెల్లపిల్లలు వచ్చిన సందర్శకులకు పొడుగాటి గాజుగ్లాసులో వైట్ వైన్, రెడ్ వైన్ లాటివి రకానికి కాస్త చొప్పున ఉచితంగా వైన్ అందిస్తున్నారు.

"అత్తయ్యగారూ! వైన్ ఆరోగ్యకరమైన పానీయం. విస్కీ బ్రాందీ ల్లాటిది కాదు. నాపా వ్యాలీకి వచ్చి వైన్ రుచి చూడకుండా వెళ్ళారంటే బొత్తిగా పల్లెటూరి వాళ్ళనుకుంటారు" అన్నాడు అల్లుడు.

"కొద్దిగా రుచి చూడమ్మా బాగానే వుంటుంది. మేము ఇదివరకు వచ్చినప్పుడు మొదట సంకోచపడ్డాము. మా స్నేహితురాళ్ళను చూసి నేనూ సరదాగా రుచి చూశానంతే. నీకు నచ్చక పోతే వదిలేయి" అంది మంగమ్మగారి కూతురు.

మామా, అల్లుడు తమకు తోచిన రకం అడిగి తీసుకున్నారు.

అక్కడకు వచ్చిన ఆడవాళ్ళు చాలా మంది ఫ్రీ ఆఫర్‌ని వదులుకోకుండా తీసుకుంటున్నారు. అందులో కొంత మంది చీరలలో వచ్చిన మధ్యవయసు ఇండియన్ లేడీస్ కూడా వుండడం చూశాక తను మాత్రం మడికట్టుకుని కూర్చుంటే కూతురికి అల్లుడికి నా మర్దాగా వుంటుదనిపించి తనూ ఒక గ్లాసు అందుకున్నారు మంగమ్మగారు. ఆ ఊపులోనే ఎవరికన్న తను తక్కువ కాదని నిరూపించుకునేందుకు మూడు రకాల వైన్స్ టేస్ట్ చేసిందావిడ.

అందరూ బయటకు వచ్చేస్తున్నప్పుడు అల్లుడు హెచ్చరించాడు. "జాగ్రత్త అత్తయ్యా. కళ్ళు తిరుగుతున్నట్టుగా వుంటే అలా కూర్చోండి. గాలిలో తేలిపోతున్నట్టు, మత్తుగా మబ్బుగా వున్నట్టు అనిపించవచ్చు. కంగారు పడకండి" అని.

అంతదాకా మామూలుగానే వున్న మంగమ్మగారికి కాస్త కళ్ళు మూతలు పడుతున్నట్టు, అడుగు తడబడుతున్నట్టు, మత్తుగా వున్నట్టు అనిపించడం మొదలయింది.

"కాస్త నా చేయి పట్టుకోవే చిన్నమ్మలూ! ఎలాగో వుంది. తూలి క్రింద పడతానో ఏమో – అంత పూజలూ వ్రతాలూ చేసిన దాన్ని చివరకు ఈ పని చేశాను" అంటూ కూతుర్ని ఆసరాగా చేసుకుని నడిచింది.

"చిన్నప్పుడు చూసిన నాగేశ్వరరావు సినిమా గుర్తుకు వస్తున్నదా ఏమిటే? 'మైకంలో వున్నాను, మన్నించాలి నా మాటలూ చేతలూ మన్నించాలి' అంటూ పాడటం మొదలు పెడతావా?" మంగపతిగారు నవ్వుతూ అడిగారు.

దగ్గర్లో వున్న ఒక గట్టుమీద కూర్చుని గోడకు చేరబడి కళ్ళు మూసుకున్నారు మంగమ్మగారు.

"మీ నాన్నగారు నాకు తెలిసి ఎన్నడూ ఒక చుక్క మందు వాసన చూసిన వారు కాదు. ఆయనెలా తట్టుకున్నారంటావు?" కళ్ళు మూసుకునే కూతుర్ని అడిగిందావిడ.

మంగపతి గారితో బాటు కూతురు అల్లుడు కూడా ఫకాలున నవ్వారు.

"అమ్మా నిన్ను ఏడిపించడానికి ఆయన ఏదేదో చెప్పి భయపెడితే నువ్వు నిజంగా ఆ 'వైన్' తాగడం వల్ల మత్తుగా, కళ్ళు తిరిగినట్టు వుందని ఊహించేసుకున్నావంతే, వాళ్ళు రుచి చూడమని ఇచ్చే ఆ కాస్తా త్రాగితే ఏమీ తేడా అనిపించదు. నీకేమీ కాలేదు పద వెడదాం" అంది కూతురు.

వాళ్ళు ముగ్గురూ కలిసి తనను ఆట పట్టిస్తున్నారని అప్పటి కర్థమయింది మంగమ్మగారికి.

"అత్తయ్యగారూ !మన బంధువుల్లో మీ పేరు మారుమోగిపోతోంది" అని అల్లుడూ.

"ఎంతైనా మంగమ్మ మోడ్రన్ మనిషిలే అమెరికా వెళ్ళి 'వైన్' రుచి చూసి వచ్చింది అని నీ గురించి గొప్పగా చెప్పుకుంటారు" అంటూ మంగపతిగారూ నవ్వుతుంటే ముసి ముసిగా నవ్వి గబ గబ వెళ్ళి కారెక్కి కూర్చున్నారు మంగమ్మగారు.

ఆదివారం రోజున 'శాంటక్లారా' లో హోటల్ సితారాలో భోజనానికి వెళ్దామన్నది మంగమ్మగారి కూతురు. ఆరోజు అక్కడ దోసె క్యాంప్ వున్నదట. మామూలుగా భోజనానికయ్యే పది డాలర్లలోనే రకరకాల దోసెలు సర్వ్ చేస్తార్ట.

'సితారా' లో కూర్చుని పాతకాలం 'మధుమతి' సినిమా లోని పాట 'అజారే పర్ దేశీ' వింటూ నాలుగైదు రకాల దోశెలు రుచి చూశాక వేరే పళ్ళెం తీసుకుని వెళ్ళి కావాల్సినవి రెండు మూడు కూరలు, 'మెంతి రైస్' వడ్డించుకుని తెచ్చుకున్నారు మంగమ్మగారు.

ఆవిడ ప్లేటులో ఎఱ్ఱగా నూనె తేలుతున్న కూరని చూస్తూ " అత్తయ్యా అటువైపు బాక్స్‌లో లాంబ్ కర్రీ పెట్టాడు. అది గానీ వడ్డించుకున్నారా? మీరు కళ్ళజోడు మరిచిపోయి వచ్చినట్టున్నారు. పైన కూరల పేర్లు రాసి పెట్టారు చూసుకున్నారా?" అనడిగాడు అల్లుడు.

మంగమ్మగారి ముఖం మాడిపోయింది. 'అయిపోయింది. వైదీక బ్రాహ్మణ ఆచారం మంట కలిసిపోయింది' అనుకుంటూ కళ్ళు మూసుకుందావిడ.

ఆవిడ వాలకం చూసి కంగారుపడింది కూతురు.

"అమ్మా నువ్వు ఘోరమైన అనాచారానికి పాల్పడ్డావనుకుని దిగులు పడిపోకు. ఇది వెజిటేరియన్ హోటల్. ఇక్కడ మాంసాహారం వుండదు. మీ అల్లుడి సంగతి నీకింకా అర్థం కాలేదా?" అంది ఓదార్పుగా మీద చెయ్యివేసి. మంగపతిగారూ, అల్లుడూ ఒక్కటే నవ్వుతుంటే అలిగి మూతి ముడుచుకు కూర్చున్నది మంగమ్మగారు.

"కోపగించుకోకండి అత్తయ్యగారూ.. ఏదో సరదాగా అన్నాను" అన్నాడు అల్లుడు.

అందరూ ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు అన్నారు మంగమ్మగారు "రేపు నేను ఉపవాసం. నిన్న ద్రాక్షరసం రుచి చూసిన దానికి, ఇవాళ లాంబ్‌కర్రీ ఏమో అనుకున్నదానికీ పరిహారంగ"

"ఇంతకీ మీరు ఆ కూర రుచి చూడనే లేదు. 'చికెన్ సిక్స్‌టీ ఫైవ్' లాగా 'ఆలూ సిక్స్‌టీ ఫైవ్' అనేకూర అత్తయ్యా అది. చాలా బాగుంది" నవ్వుతూ అన్నాడు అల్లుడు.

"చాలు బాబూ కొత్తపేర్లు చెప్పి భయపెట్టకు, మంగమ్మకూ మాంసాహారానికీ అమడ దూరం.... " అందావిడ నవ్వేసి.

"కానీ మంగమ్మ గారు మదిరాపానం చేశారు" ముసి ముసిగా నవ్వుతూ అన్నారు మంగపతిగారు.

● ఆంధ్రభూమి వార పత్రిక - 20-7-2006 ●